


RNI No. TEL/TEL/2018/76342

# లోకంతీరు

LOKAMTEERU TELUGU DAILY సామాజిక, రాజకీయ దిన పత్రిక

ప్రచురణ : నిజామాబాద్ ఆదివారం 13-04-2025 ఎడిటర్ : బ్యాగల్ శ్రీనివాస్ సంపుటి : 07 సంచిక : 67 పేజీలు : 4 వెల : రూ 2-00

## సర్వంగ సుందరంగా తాడ్ బన్ హనుమాన్ ఆలయం

సికింద్రాబాద్..హనుమాన్ జయంతి పురస్కరించుకొని తాడ్ బండ్ హనుమాన్ దేవాలయాన్ని సర్వంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం నుండే పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ప్రత్యేక పూజలు అభిషేకాలు హనుమాన్ చాలీసా పారాయణాలతో తాడ్ బండ్ హనుమాన్ దేవాలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.ఆంజనేయ స్వామి దర్శనం నిమిత్తం భక్తులకు ఎలాంటి ఆసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాటు చేశారు.. ఆలయ ప్రాంగణమంతా జైశ్రీరామ్ నినాదాలతో మార్మోగుతుంది. ఆలయ పరిసర ప్రాంతాలలో రామలక్ష్మణుల సమేత హనుమంతుడి విశేష అలంకరణ తో పాటు విద్యుత్ దీపాల వెలుగులు అందరినీ ప్రత్యేకంగా ఆకర్షిస్తున్నాయి.

# హైదరాబాద్‌లో కొత్త ప్రాజెక్టులపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

హైదరాబాద్: మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. బాపూ ఘాట్ వద్ద నిర్మించ తలపెట్టిన గాంధీ సరోవర్‌తో పాటు మీర్ ఆలం ట్యాంక్‌పై నిర్మించనున్న బ్రిడ్జి నమూనాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. మీర్ ఆలం ట్యాంక్‌పైన బ్రిడ్జి నిర్మాణ పనులకు జూన్‌లో టెండర్లు పిలవాలని చెప్పారు. ఈలోగా అందుకు అవసరమైన సర్వేలు, నివేదికలు, ప్రతిపాదనలు, డిజైన్లతో డీపీఆర్‌ను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. మూసీ పునరుజ్జీవనంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. మీర్ ఆలం ట్యాంక్‌పై నిర్మించే బ్రిడ్జికి సంబంధించి కన్సెల్టెన్సీలు తయారు చేసిన నమూనా డిజైన్లను అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. ంశ్రీబనీ ఖీవజీట "విధ్వంసమే కాదు, 10 వేల కోట్ల స్కాం! హెచ్‌సీయూ భూములపై కేటీఆర్ సంచలనం" రెండున్నర కిలోమీటర్ల పొడవైన ఈ బ్రిడ్జిని అద్భుతంగా నిర్మించాలి. సందర్శకులు, ప్రయాణికుల రక్షణకు అధిక ప్రాధాన్యత ఉండే విధంగా డిజైన్లను ఎంచుకోవాలి. ఈ బ్రిడ్జితో పాటు మీర్ ఆలం ట్యాంక్‌లో వివిధ చోట్ల ఐలాండ్లు ఉన్న మూడు ప్రాంతాలను పర్యాటకులను ఆకట్టుకునేలా అందంగా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ ఆదేశించారు. సింగపూర్‌లోని 'గార్డెన్స్ బై ది బే' ను తలపించేలా బర్డ్స్ పారడైజ్, వాటర్ ఫాల్స్ లాంటివి ఉండేలా ఈ మూడు ఐలాండ్లను అత్యంత సుందరంగా అభివృద్ధి చేయాలి. వెడ్డింగ్ డెస్టినేషన్‌కు వీలుగా ఉండే కన్వెన్షన్ సెంటర్లతో పాటు అడ్వంచర్ పార్క్, థీమ్ పార్క్, అంఫీ థియేటర్‌తో కూడిన డిజైన్లు ఉండాలన్నారు సీఎం రేవంత్. బోటింగ్‌తో పాటు పర్యాటకులు విడిది చేసేలా రిసార్ట్స్, హోటల్స్ అందుబాటులో ఉండాలి. ట్యాంక్‌లో నీటిని శుద్ధి చేయటంతో పాటు ఐలాండ్‌ను అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని ప్రతిపాదనలతో డీపీఆర్



సిద్ధం చేయాలి. పీపీపీ మోడల్లో ఈ ఐలాండ్ జోన్‌ను అభివృద్ధి చేసేలా ప్రతిపాదనలు తయారు చేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు.ట్యాంక్‌లో నీటి లభ్యతను, వరద వచ్చినప్పుడు ఉండే నీటి ప్రవాహ తీవ్రతను ముందుగానే అంచనా వేసుకొని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందు చూపుతో డిజైన్లు రూపొందించాలి. ఈ ప్రాజెక్టుకు అవసరమైన హైడ్రాలజీతో పాటు పర్యావరణానికి సంబంధించి నిపుణులు, లేదా ఆ రంగంలో పేరొందిన సంస్థలతో సర్వే చేయించి ఆ మేరకు అవసరమైన అన్ని అనుమతులు తీసుకోవాలని సీఎం సూచించారు. మీర్ ఆలం బ్రిడ్జితో పాటు ఈ ఐలాండ్ జోన్‌ను పక్కనే ఉన్న జూ పార్కుకు అనుసంధానం చేయాలి. ఇక్కడి అభివృద్ధి ప్రణాళికలను దృష్టిలో పెట్టుకొని జూ పార్కును అప్‌గ్రేడ్ చేయాలి. జూ అధికారులతో సంప్రదింపులు జరిపి, నిబంధనల ప్రకారం అప్‌గ్రేడ్ చేసేందుకు ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించాలి. అభివృద్ధి ప్రతిపాదనలన్నీ పర్యాటకులను మరింత ఆకట్టుకునేలా ఉండాలి... అని ముఖ్యమంత్రి సూచించారు. సమీక్షా సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు వేం నరేంద్ర రెడ్డి, శ్రీనివాస రాజు, మున్సిపల్ శాఖ, మూసీ రివర్ ఫ్రంట్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# శోభాయమానంగా హనుమాన్ జయంతి వేడుకలు



హైదరాబాద్: హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయాలు ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపాలతో శోభాయమానంగా వెలుగొందుతున్నాయి. శనివారం తెల్లవారు జామునుంచే భక్తులు హనుమాన్ ఆలయాలకు చేరుకుని స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. కాగా గ్రేటర్ హైదరాబాద్‌లోని అన్ని ప్రాంతాల్లోనూ వీర హనుమాన్ శోభాయాత్రలు జరగనున్నాయి. హిందూ బంధువులు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండుగల్లో హనుమాన్ జయంతి కూడా ఒకటి. రామ భక్తుడ్ని మనసారా పూజిస్తే.. అన్ని రకాలుగా మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం.'జై బోలో హనుమాన్‌కి, జైశ్రీ రాం' అంటూ భక్తుల ఆధ్యాత్మిక నినాదాలు, యువత ఉత్సాహంతో శనివారం నిర్వహించే హనుమాన్ జయంతికి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వేడుకల్లో భాగంగా నిర్వహించే శోభాయాత్రలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తనిఖీలు చేస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేకంగా పికెటింగ్ ఏర్పాటు చేశారు. ముఖ్యంగా పశ్చిమ మండలం పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించిన అధికారులు ఆయా ప్రాంతాల్లో శాంతి భద్రతలకు ఎలాంటి ఆటంకం కలుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.పశ్చిమ మండలం పరిధిలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, ఫిలింనగర్, సంజీవరెడ్డినగర్, మధురానగర్, బోరబండ, మాసబ్‌ట్యాంక్ పోలీసుస్టేషన్ పరిధిలో ఇప్పటికే ర్యాలీలు ఎక్కడి నుంచి ఎక్కడి వరకు నిర్వహిస్తారనే దానిపై పోలీసులకు స్పష్టత వచ్చింది. కొన్ని ర్యాలీలు ఉత్సవాలు జరిగే ఆలయాల పరిధిలోనే జరుగుతుండగా, మరికొన్ని ప్రధాన ర్యాలీల్లో కలుస్తుండటంతో అందుకు అనుగుణంగా అదనపు బలగాలను రంగంలోకి దించారు. సుమారు రెండు వేల మందికి పైగా అదనపు సిబ్బందిని హనుమాన్ శోభాయాత్ర బందోబస్తుకు ఉపయోగించనున్నారు. ఆలయాల వద్ద కూడా బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా ఆలయాలకు వచ్చే మహిళా భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా మహిళా సిబ్బందిని వినియోగిస్తున్నారు.బంజారాహిల్స్ డివిజన్ పరిధిలో హనుమాన్ జయంతి సందర్భంగా ర్యాలీలు నిర్వహించే యువత పోలీసుల నిబంధనలను, ఆదేశాలను కచ్చితంగా పాటించాలని బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి సూచించారు. ర్యాలీకి అవాంతరాలు ఏర్పడకుండా ముందస్తుగా సీసీ కెమెరాలను అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి ర్యాలీని వీడియో కెమెరాతో చిత్రీకరిస్తామని, ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన, గొడవలకు దిగితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ర్యాలీలు చేసేందుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో పికెట్లను ఏర్పాటు చేశామని ఏసీపీ తెలిపారు.

# బిల్లులపై రాష్ట్రపతి నిర్ణయానికి 3 నెలలు గడువు..

## సుప్రీంకోర్టు సంచలన తీర్పు



న్యూఢిల్లీ: రాష్ట గవర్నర్లు పంపే బిల్లులపై రాష్ట్రపతికి నిర్దిష్ట టైమ్‌లైన్ విధిస్తూ సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. గవర్నర్లు పంపే బిల్లులపై రాష్ట్రపతి 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాల్సిందేనని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. తమిళనాడుకు అసెంబ్లీ ఆమోదించిన 10 బిల్లులను రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి ఆపి ఉంచడంపై నాలుగు రోజుల క్రితం సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేంది. ఇది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ ఆ బిల్లులకు క్లియరెన్స్ ఇచ్చింది. ఏదైనా బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం నిలిపి ఉంచాల్సి వస్తే గవర్నర్ తీసుకోవాల్సిన అత్యధిక గడువు నెలరోజులు మాత్రమేనని తీర్పు ఇచ్చింది. 415 పేజీలతో కూడిన పూర్తి తీర్పును శుక్రవారం రాత్రి 10.54 గంటలకు సుప్రీంకోర్టు వెస్‌సైట్‌లో ఉంచారు.కాగా, గవర్నర్లు పంపే బిల్లుపై రాష్ట్రపతి మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లో కూడిన ధర్మాసం తాజాగా తీర్పునిచ్చింది. ఏదైనా జాప్యం జరిగితే రాష్ట్రపతి భవన్ అందుకు కారణాలను రాష్ట్రాలకు వివరించాలని, నిర్దేశిత గడువులోగా రాష్ట్రపతి నుంచి స్పందన లేకుండా రాష్ట్ర ప్రభుత్వాలు మాండమస్ రిట్ పిటిషన్ దాఖలు చేయవచ్చని సుప్రీంకోర్టు సుచించింది.రాజ్యాం గంలోని 200వ అధికారణ ప్రకారం మంత్రిమండలి సలహా సూచనల మేరకు గవర్నర్లు తప్పనిసరిగా వ్యవహరించాల్సి ఉంటుందని, రెండోసారి సమర్పించిన బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం రిజర్వ్ చేసే అధికారం గవర్నర్లకు లేదని మార్చి 8న ఇచ్చిన తీర్పులో సుప్రీం ధర్మాసనం తెలిపింది. నిర్దిష గడువులోగా గవర్నర్ చర్య తీసుకోకుంటే గవర్నర్ చర్య జ్యుడిషియల్ స్క్రూటినీని ఎదుర్కోవలిసి వస్తుందని హెచ్చరించింది.కాగా, గవర్నర్ తొక్కిపెట్టిన 10 బిల్లులకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

# రైయిన్ అలర్ట్..

## రాబోయే 3 రోజులు భారీ వర్షం

హైదరాబాద్, తెలంగాణలో రానున్న మూడురోజులు పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోని అల్పపీడనానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని అధికారులు తెలిపారు. సగటున సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించిందని పేర్కొన్నారు.ఈ ప్రభావం కారణంగా రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో తుఫానుతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అంచనా వేస్తుంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలోని నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. కాగా, గత 3 రోజులుగా రాష్ట్రంలో అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నాయి.

# 6 వేల మందిని రికార్డుల్లో చంపేసిన ట్రంప్ సర్కార్

వాషింగ్టన్ : అమెరికాలో నివసిస్తున్న ఆరు వేల మంది వలసదారులను ట్రంప్ ప్రభుత్వం రికార్డుల్లో చంపేసింది. వారంతా జీవించి ఉన్నప్పటికీ అధికారులు మాత్రం రికార్డుల్లో మరణించినట్లు అప్‌డేట్ చేశారు. దీనితో వారి సోషల్ సెక్యూరిటీ నంబర్ ఆటోమేటిక్‌గా రద్దు అవుతుంది. అమెరికాలో సోషల్ సెక్యూరిటీ నంబర్ తప్పనిసరి. అమెరికా పౌరులతో పాటు తాత్కాలికంగా ఆశ్రయం కోసం



వచ్చినవారికీ ప్రభుత్వం ఈ నంబర్ కేటాయిస్తుంది. ఈ సోషల్ సెక్యూరిటీ నంబర్ లేదంటే వారి జీవించి ఉన్నా కూడా మరణించినట్లుగానే పరిగణిస్తారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రయోజనాలూ పొందే అవకాశం వారికి ఉండదు. అంతే కాదు, ఉద్యోగం కానీ, ఏదైనా చిన్నపాటి పని కానీ చేసుకునే వీలు ఉండదు. వలసదారులు తమంతట తామే అమెరికాను విడిచి వెళ్లిపోయేలా చేసేందుకు అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.పొమ్మనలేక పొగ బెట్టినట్లు అనేది తెలుగు సామెత. కానీ, ట్రంప్ సర్కార్ మాత్రం పొమ్మనే పొగ పెట్టినట్లు ఇలా రికార్డుల్లో వలసదారులను చంపేసింది. బైడెన్ సర్కార్ అమలు చేసిన పలు కార్యక్రమాల ద్వారా సుమారు 90 వేల మంది వలసదారులు అమెరికాలో అడుగు పెట్టారని అధికారులు తెలియజేశారు. వారందరూ తాత్కాలిక ఆశ్రయం కోరి వచ్చినవారేనని అధికారులు తెలిపారు. అయితే, గడువు ముగిసినప్పటికీ వారు స్వదేశానికి తిరిగి వెళ్లలేదని, అమెరికాలోనే ఉంటున్నారని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో వారందరినీ వెతికి పట్టుకుని వెనుకకు పంపడం శ్రమతో కూడుకున్నదని అధికారులు చెప్పారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ రికార్డుల్లో వారు చనిపోయినట్లు నమోదు చేస్తే సోషల్ సెక్యూరిటీ నంబర్ రద్దు అయి వారు తమ అంతట తామే అమెరికాను వీడుతారని అధికారులు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే తాజాగా ఆరు వేల మంది వలసదారులను రికార్డుల్లో మరణించినట్లుగా నమోదు చేశారు.

# మహిళలకు ప్రత్యేక పారిశ్రామిక పార్కులు

## ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు...

## గ్రామీణ మహిళలకు ప్రాధాన్యం

## రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

హైదరాబాద్ ఏప్రిల్ 12.ప్రతి నియోజకవర్గంలో మహిళల కోసం ప్రత్యేకంగా పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర





ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. శనివారం హైటెక్స్ లో జూన్ 12 నుంచి 14 వరకు నిర్వహించనున్న "ఫుడ్ ఏ ఫెయిర్" రెండో ఎడిషన్ బ్రోచర్ ను ఆయన లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూరాష్ట్ర ప్రభుత్వం, హైటెక్స్ ఎగ్జిబిషన్స్, తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సంయుక్తాధ్వర్యంలో ఈ ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆహార ఉత్పత్తిదారులు, ఆహార శుద్ధి నిపుణులు, ప్యాకేజింగ్ ఇండస్ట్రీ నిపుణులు, చెఫ్స్ తదితరులు ఈ ప్రదర్శనలో పాల్గొని వివిధ అంశాలపై మేధోపర చర్చలు చేస్తారన్నారు. ఐటీ, ఫార్మా మాదిరిగానే వ్యవసాయ, వ్యవసాయాధారిత పరిశ్రమల రంగంలోనూ తెలంగాణను దేశంలోనే మొదటి స్థానంలో నిలపడం తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణలో అనుకూల పరిస్థితులు ఉన్నాయన్నారు. ఇప్పటికే ఈ రంగంలో రూ.16వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, అవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 7150 ఎకరాల్లో 14 స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్స్ ఉన్నాయని, రాబోయే రోజుల్లో టైర్ 2, టైర్ 3 నగరాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రాధాన్యమిస్తామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 6800కు పైగా మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ ఉన్నాయని, కొత్తగా ఏర్పాటు చేసే ఔత్సాహికులకు ప్రభుత్వం ఆర్థికంగా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ మల్సూర్, తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ డైరెక్టర్ అఖిల్, "ఫుడ్ ఏ ఫెయిర్" నిర్వాహకులు శ్రీకాంత్, టీజీ శ్రీకాంత్, విశాల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆశా.న్యూరో క్లినిక్ ప్రారంభించిన మంత్రి.



హైదరాబాద్, ఏప్రిల్12: కోకాపేట లో ఆశన్యూరో మాడ్యులేషన్ క్లినిక్ ను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యక్రమంలో పాల్గొన్న అల్లం నారాయణ , అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ గంటా చక్రపాణి ,సీనియర్ జర్నలిస్ట్ కే శ్రీనివాస్ ,మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ తదితరులు.ఆశన్యూరో మాడ్యులేషన్ క్లినిక్ ప్రారంభోత్సవం సందర్భంగా మాజీ మీడియా అకాడమి చైర్మన్ అల్లం నారాయణ కుమార్తె అల్లం భావన కి మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు

# వనజీవి రామయ్య మృతికి ప్రధాని మోదీ సంతాపం!

జీవితాంతం మొక్కలు నాటుతూ వన జీవిగా పేరు తెచ్చుకున్న పద్మశ్రీ వనజీవి రామయ్య గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందే. అయితే ఆయన మరణ వార్త తెలుసుకున్న ప్రధాని నరేంద్ర మోదీ తన సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్ వేదికగా సంతాపం తెలిపారు. మొక్కలు నాటి వాటిని జీవితాంతం రక్షించారు. రామయ్య కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి అంటూ



పేర్కొన్నారు మోదీ. చెట్లను నాటి, వాటి రక్షణ కోసం వనజీవి రామయ్య తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. వనజీవి రామయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన మోదీ.. రామయ్య అవిశ్రాంత కృషి.. ప్రకృతి పట్ల ప్రేమ, భవిష్యత్తు తరాల పట్ల బాధ్యతను తెలియజేస్తుందన్నారు.కాగా వనజీవి రామయ్య అంత్యక్రియలు రేపు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. జీవితాంతం మొక్కలు నాటి పెంచిన రామయ్య.. ఇంటి పేరునే వనజీవిగా మార్చుకున్నారు. కోటి మొక్కలు నాటి సరికొత్త చరిత్ర సృష్టించారు. వనజీవి రామయ్య మృతిపై పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. చెట్ల ప్రేమికుడు రామయ్య మృతిపై ప్రధాని మోదీ సంతాపం తెలిపారు. చెట్లను నాటి, వాటి రక్షణ కోసం వనజీవి రామయ్య తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. వనజీవి రామయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన మోదీ.. రామయ్య అవిశ్రాంత కృషి.. ప్రకృతి పట్ల ప్రేమ, భవిష్యత్తు తరాల పట్ల బాధ్యతను తెలియజేస్తుందన్నారు.

# సంపాదకీయం

ఆదివారం 13-04-2025

## ఎట్టకేలకు భారత్ కు రాణా...

### మోడీ దౌత్య ఫలితం

ముంబయి దాడుల నిందితుడు తహవ్వుర్‌రాణాను అమెరికా భారత్‌కు అప్పగించింది.ముంబయి దాడులకు బాధ్యుడైన తహవ్వుర్ రాణాను అమెరికా అప్పగించిందని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) తెలిపింది.అప్పగింత ప్రక్రియ ప్రారంభం కావడానికి ముందు రాణా.. అమెరికాలో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారని ఎన్‌ఐఏ తెలిపింది. తేదీ 26 నవంబర్ 2008, ముంబైలో ఉగ్రవాద దాడి జరిగిన రోజు ఇదే. ఈ దాడి జరిగి దాదాపు 17 సంవత్సరాలు అయ్యింది. కానీ ఈ కుట్రలో నిందితులైన చాలా మందికి ఇంకా శిక్ష పడలేదు. ముంబై ఉగ్రవాద దాడుల సూత్రధారి తహవ్వూర్ రాణాను ఎట్టకేలకు అమెరికా నుండి భారతదేశానికి తీసుకువచ్చారు. ఇప్పుడు ఈ ఉగ్రవాద దాడిని ఎలా చేశారు..? ఏ కుట్ర పన్నారో త్వరలో బయటపడనుంది. కుట్ర వెనుక దాగి ఉన్న అన్ని రహస్యాలు బయటపడతాయి.ముంబై దాడుల ప్రధాన నిందితుడు తహవూర్ రాణాను ఎన్‌ఐఏ అధికారులు పాటియాలా హౌస్ కోర్టులో హాజరుపరిచారు. అక్కడి నుంచి ఎన్‌ఐఏ అతని 18 రోజుల కస్టడీకి తీసుకుంది. నిందితుడు తహవూర్ రాణా అమెరికాలో నివసిస్తున్న పాకిస్తానీ పౌరుడు. రాణాను ఉరితీయాలనే డిమాండ్ ఉంది. అయితే భారతదేశంలో రాణా తరుపున కేసును వాదించడానికి, అతనిని ఉరి నుండి కాపాడటానికి, న్యాయవాది పియూష్ సచ్‌దేవా వకల్తా పుచ్చుకున్నాడు. రాణాకు చట్టపరంగా ఉన్న దారులన్నీ మూసుకుపోవడంతో ఆయన అప్పగింత సాధ్యపడిందని తెలిపింది.తహవ్వూర్ రాణా 2013లో ఆయన స్నేహితుడు డేవిడ్ కోల్‌మన్ హెడ్లీతో కలిసి ముంబై దాడులకు పాల్పడినందుకు, డెన్మార్క్‌లో దాడికి ప్రణాళిక వేసినందుకు అమెరికాలో ఆయన దోషిగా తేలారు.ఈ కేసుల్లో, తహవ్వూర్ హుస్సేన్ రాణాకు అమెరికా కోర్టు 14 సంవత్సరాల జైలు శిక్ష విధించింది.భారీగా ఆయుధాలు ధరించి శిక్షణ పొందిన పది మంది లష్కరే తోయిబా ఉగ్రవాదులు 2008 నవంబర్ 26న ముంబయిలోని అనేక ప్రదేశాలు, ప్రసిద్ధ భవనాలపై దాడులు చేశారు. ఈ దాడులు నాలుగు రోజుల పాటు కొనసాగాయి. 160 మందికి పైగా మరణించారు.ముంబయి నగరం 2008 నవంబర్ 26వ తేదీ రాత్రి, అకస్మాత్తుగా తుపాకీ కాల్పుల శబ్దంతో దద్దరిల్లింది. దాడి చేసిన వ్యక్తులు ముంబయిలోని రెండు ఫైవ్ స్టార్ హోటళ్ళు, ఒక ఆసుపత్రి, రైల్వే స్టేషన్లు, ఒక యూదు కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకున్నారు.మొదట్లో ఇంత పెద్ద దాడి జరిగుతుందని ఎవరూ ఊహించలేదు. కానీ క్రమంగా దాడి తీవ్రత అర్థమయింది.నవంబర్ 26వతేదీ రాత్రి, ఉగ్రవాద నిరోధక దళం చీఫ్ హేమంత్ కర్కరే సహా ముంబయి పోలీసు ఉన్నతాధికారులు కూడా ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయారు.లియోపోల్డ్ కేఫ్, ఛత్రపతి శివాజీ టెర్మినల్ వద్ద ప్రారంభమైన ఈ మారణకాండ తాజ్ మహల్ హోటల్ వద్ద ముగిసేలోపు దీనిని ఆపేందుకు భద్రతా సిబ్బందికి 60గంటల సమయం పట్టింది. 160మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.దాడిచేయడానికి వచ్చినవారు రెండు గ్రూపులుగా విడిపోయినట్టు ముంబయి పోలీసులు, దర్యాప్తు అధికారులు చెప్పారు.వీరిలో ఇద్దరు వ్యక్తులు లియోపోల్డ్ కేఫ్‌లోకి చేరుకుని విచక్షణారహితంగా కాల్పులు జరిపారు.ఈ కేఫ్‌కి ఎక్కువగా విదేశీయులు వస్తుంటారు.అక్కడ ఉన్న ప్రజలకు ఏం జరుగుతుందో అర్థమయ్యేలోపే వారు విచక్షణారహితంగా తూటాలు పేల్చి అక్కడి నుంచి పారిపోయారు.అధికారిక గణాంకాల ప్రకారం, లియోపోల్డ్ కేఫ్‌లో జరిగిన కాల్పుల్లో 10 మంది మరణించారు.దేశంలో అత్యంత రద్దీగా ఉండే రైల్వే స్టేషన్లలో.. ముంబయిలోని ఛత్రపతి శివాజీ టెర్మినస్ కూడా ఒకటి .ఆ సమయంలో అక్కడ పెద్ద సంఖ్యలో ప్రయాణికులు ఉన్నారు.దుండగులు ఒక్కసారిగా విచక్షణారహితంగా తూటాలు పేల్చారు.ఈ కాల్పుల్లో అజ్మల్ అమీర్ కసబ్, ఇస్మాయిల్ ఖాన్ పాల్గొన్నారని దర్యాప్తు అధికారులు తెలిపారు.తరువాత అజ్మల్ అమీర్ కసబ్ పట్టుబడ్డారు కానీ ఇస్మాయిల్ ఖాన్ చనిపోయారు.ఈ కాల్పుల్లో 58 మంది మరణించారు.పెద్దమొత్తంలో మందుగుండు సామగ్రితో దుండగులు ఈ హోటల్‌లోకి ప్రవేశించారు.ఆ సమయంలో అక్కడ 350 మందికి పైగా ఉన్నారని భావిస్తున్నారు.వారిలో చాలా మందిని దుండగులు బందీలుగా చేసుకున్నారు.దాడి చేసిన ఇద్దరు దుండగులను జాతీయ భద్రతా దళ సిబ్బంది హతమార్చారు.తాజ్ మహల్ హోటల్‌లో చెలరేగిన అగ్నిప్రమాదం ప్రజల గుండెల్లో అలానే ఉంది.కాల్పులు, పేలుళ్ల మధ్య, తాజ్ మహల్ హోటల్ కాలిపోవడాన్ని వారింకా మరచిపోలేరు.ఈ భవనం 105 సంవత్సరాల పురాతనమైనది.గేట్ వే ఆఫ్ ఇండియా సమీపంలో ఉన్న ఈ హోటల్‌కి ఎక్కువగా విదేశీ పర్యటకులు వస్తుంటారు. ఇక్కడి నుంచి సముద్ర తీరం కూడా కనిపిస్తుంది.హోటల్‌పై దాడి జరిగినప్పుడు, భోజన సమయం కావడంతో అక్కడ చాలా మంది గుమిగూడి ఉన్నారు. అప్పుడు దుండగులు అకస్మాత్తుగా కాల్పులు మొదలుపెట్టారు.ప్రభుత్వ గణాంకాల ప్రకారం, తాజ్ మహల్ హోటల్‌లో 31 మంది మరణించారు.దాడి చేసిన నలుగురు వ్యక్తులు భద్రతా సిబ్బంది చేతిలో చనిపోయారు.కామా హాస్పిటల్ అనేది ఓ చారిటీ ఆసుపత్రి, దీనిని 1880లో ఒక సంపన్న వ్యాపారవేత్త నిర్మించారు.ముంబయి పోలీసుల కథనం ప్రకారం, నలుగురు దుండగులు ఒక పోలీసు వ్యాన్‌ను హైజాక్ చేసి, ఆపై ఆపకుండా కాల్పులు జరిపారు.ఈ క్రమంలో వారు ఆసుపత్రిలోపలికి కూడా ప్రవేశించారు.ఆసుపత్రి బయట జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఉగ్రవాద నిరోధక దళం అధిపతి హేమంత్ కర్కరే, ముంబయి పోలీసులకు చెందిన అశోక్ కామ్టే, విజయ్ సలాస్కర్ మరణించారు.దుండగులు నారిమన్ హౌస్‌ను కూడా లక్ష్యంగా చేసుకున్నారు.దీనిని చాబాద్ లుబావిచ్ సెంటర్ అని కూడా పిలుస్తారు.నారిమన్ హౌస్‌లో కూడా అనేక మందిని బందీలుగా చేసుకున్నారు దుండగులు.ఈ భవనం యూదులకు సహాయం చేయడానికి నిర్మించిన కేంద్రం, ఇక్కడ యూదు పర్యటకులు కూడా తరచుగా బస చేసేవారు.ఈ కేంద్రంలో యూదు గ్రంథాల లైబ్రరీ, ప్రార్థనా స్థలం కూడా ఉన్నాయి.దుండగుల ఆట కట్టించేందుకు ఎన్‌ఎస్‌జీ కమాండోలు ఈ భవనం పక్కనున్న భవనంపైకి హెలికాప్టర్ నుంచి దిగారు. ఎన్‌ఎస్‌జీ కాల్పుల్లో దుండగులు మరణించారు. అయితే దుండుగుల అదుపులోని బందీలు కూడా చనిపోయారు. ఆ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు వ్యక్తులు, ఇద్దరు దుండగులు మరణించారు.చాబాద్ హౌస్‌పై జరిగిన దాడిలో, దానిని నడిపిన గాబ్రియల్, ఆయన భార్య రివ్కా కూడా మరణించారు. వారి రెండేళ్ల కుమారుడు మోషేను రక్షించారు. ఈ దాడిలో ఆరుగురు యూదులు మరణించారు.

## ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో శోభయాత్ర నిర్వహించుకోవాలి పోలీస్ కమిషనర్






నిజామాబాద్ ఏప్రిల్ 12. ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో శోభాయాత్ర ప్రతి ఒక్కరు నిర్వహించుకోవాలని ఎవరు కూడా ఎక్కడ కూడా ఎలాంటి అల్లర్లకు పాల్పడకుండా శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య పిలుపునిచ్చారు. ఈ మేరకు నిజామాబాద్ నగరంలోని హనుమాన్ శోభాయాత్ర నీలకంటేశ్వర్ దేవాలయం నుండి ఆర్‌ఆర్ చౌరస్తా వరకు ఏర్పాట్లను పరిశీలించిన సిపి. శోభయాత్ర బందోబస్తు ఏర్పాట్లను క్షుణంగా పరిశీలించి పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందని వారి కార్యాలయం నుండి జారీ చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎవరు కూడా ఇలాంటి రూమర్సులను నమ్మకూడదని ఇట్టి శోభయాత్ర పూర్తిగా సీసీ కెమెరాల నిఘా మధ్య నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ యందు ఏర్పాటు చేసినటువంటి దాదాపు 225 సీసీ కెమెరాల ఫుటేజ్ విభాగం ద్వారా హనుమాన్ శోభాయాత్రను వీక్షించారు.

## ఒక ప్రపంచ పర్యావరణ వేత్తను కోల్పోయాం...

హైదరాబాద్: వనజీవి రామయ్య మరణం పచ్చదనానికి తీరని లోటని, తెలంగాణ ఒక ప్రపంచ పర్యావరణవేత్తను కోల్పోయిందని బీఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నారు. పచ్చదనం పరిరక్షణ కోసం వనజీవి చేసిన కృషిని స్మరించుకున్నారు. పర్యావరణ పరిరక్షణే ప్రాణంగా బతికిన పద్మశ్రీ వనజీవి రామయ్య మృతిపట్ల కేసీఆర్ విచారం వ్యక్తం చేస్తూ, సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'వృక్షో రక్షతి రక్షితః ' అనే నినాదాన్ని తన శరీరంలో భాగం చేసుకుని, కోటికి పైగా మొక్కలను నాటి, ప్రపంచానికి పచ్చదనం ప్రాముఖ్యతను ప్రచారం చేసిన



వనజీవి రామయ్య లక్ష్యం మహోన్నతమైనదని కొనియాడారు.మొక్కల పెంపకం కోసం వనజీవిగా మారిన దర్పల్లి రామయ్య జీవితం రేపటి తరాలకు ఆదర్శనీయమని కేసీఆర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ కోసం సాగిన మానవ కృషిలో వనజీవిగా ఆయన చేసిన త్యాగం అసమాన్యమైనదని కేసీఆర్ అన్నారు. అడవులు, పచ్చదనం అభివృద్ధి దిశగా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన.. తెలంగాణకు హరిత హారం ... ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రామయ్య అందించిన సహకారం గొప్పదని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. భవిష్యత్తు తరాలకు మనం అందించే సంపద హరిత సంపదే కావాలని, భౌతిక ఆస్తులు కావనీ కేసీఆర్ పునరుద్ఘాటించారు.పచ్చని అడవులను ధ్వంసం చేస్తూ, వన్యప్రాణులకు నిలువనీడ లేకుండా ప్రభుత్వాలు ప్రదర్శిస్తున్న పర్యావరణ వ్యతిరేక ధోరణులను నిలువరించడానికి, వర్తమాన పరిస్థితుల్లో వేలాది వనజీవి రామయ్యల అవసరం ఉన్నదని కేసీఆర్ స్పష్టం చేసారు. వనజీవి మరణంతో తెలంగాణ ఒక ప్రపంచ పర్యావరణ వేత్తను కోల్పోయిందని విచారం వ్యక్తం చేసారు. శోకంలో మునిగిన వారి కుటుంబ సభ్యులకు అభిమానులకు పర్యావరణ పరిరక్షకులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.కాగా పద్మశ్రీ అవార్డ్ గ్రహీత, వనజీవి రామయ్య (85) కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఇవాళ (శనివారం) తెల్లవారుజామున ఇంట్లో స్పృహ లేకుండా ఉంటే దగ్గరలోని ఆర్‌ఎంపీకి చూయించి ప్రభుత్వ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తీసుకువచ్చారు. ఆస్పత్రిలో చికిత్స అందిస్తుండగానే రామయ్య చనిపోయారు. కోటి మొక్కలకు పైగా వనజీవి రామయ్య, జానకమ్మ దంపతులు నాటారు. కోటికి పైగా మొక్కలను నాటి వనజీవి రామయ్య చరిత్ర సృష్టించారు. . మొక్కలను పెంచాలని చిన్నతనం నుంచే ప్రచారం చేశారు. మొక్కలు నాటుతూ దరిపల్లి రామయ్య అలియాస్ వనజీవి రామయ్య సేవ చేశారు. వనజీవి రామయ్యకు నలుగురు పిల్లలు.. వారిలో ముగ్గురు అబ్బాయిలు, ఒక అమ్మాయి ఉన్నారు. వనజీవి రామయ్య భార్య పేరు జానకమ్మ.

## బాన్సువాడ లో పోచారం హనుమాన్ పూజలు






బాన్సువాడ,ఏప్రిల్12:బాన్సువాడ నియోజకవర్గం హనుమాన్ జయంతి సందర్భంగా బాన్సువాడ పట్టణ కేంద్రంలోని పెద్ద హనుమాన్ మందిరం,పాత బాన్సువాడ దేశాయిపేట గ్రామంలోని హనుమాన్ మందిరాలలో ఆంజనేయ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు అనంతరం వర్ని మండల పరిధిలోని బెల్యా నాయక్ తండాలో శివ పంచాయతన అభయాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్న బాన్సువాడ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు భక్తులు

## పోలవరం ముంపుపై అధ్యయనం

కరీంనగర్, ఏప్రిల్ 12, (న్యూస్ పల్స్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గోదావరి నదీ జలాలపై అక్రమంగా నిర్మించతలపెట్టిన గోదావరి బనకచర్ల లింక్ ప్రాజెక్టును వెంటనే అడ్డుకోవాలని తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఈమేరకు శుక్రవారం గోదావరి నదీ యాజమాన్యం బోర్డు (జిఆర్‌ఎంబి), పోలవరం ప్రాజెక్టు అథారిటీలకు తెలంగాణ నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సి) జి.అనిల్ కుమార్ లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఏకపక్షంగా ఏపి ప్రభుత్వం గో దావరి బనకచర్ల లింక్ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రతిపాదించడం, ఇందుకు ప్రత్యేకంగా స్పెషల్ పర్పస్ వెహికిల్(ఎస్‌పివి)గా జలహారతి కార్పొరేషన్‌ను ఏర్పాటుచేస్తూఈనెల 3వ తేదీన జరిగిన ఏపి మంత్రివర్గ సమావేశం లో నిర్ణయం తీసుకోవడం, ఈనెల 8వ తేదీన ఉత్తర్వులు(జి.వో.నెం.16) జారీచేయడాన్ని తెలంగాణ తీవ్రంగా ఆక్షేపించింది. గోదావరి బనకచర్ల లింక్ ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014కు విరుద్ధమని, దీనిపై తెలంగాణ ప్రభుత్వం వ్యక్తపరుస్తున్న అభ్యంతరాలను ఏమాత్రం పట్టించుకోకుండా ఏపి ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆలేఖలో పేర్కొన్నారు. గోదావరి బనకచర్ల లింక్ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.80,112 కోట్లు అంచనాలతో 200 టిఎంసి గోదావరి నీటిని మళ్లించుకోవాలని ఏపి ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని వివరించారు.పోలవరం ప్రా జెక్టు ముంపు ప్రభావంపై సంయుక్త సర్వే చేయాలని, ముంపు, బ్యాక్ వాటర్స్ ప్రభావంపై అధ్యయనం చేయాలని తెలంగాణ ప్రభుత్వం పోలవ రం ప్రాజెక్టు అథారిటీని కోరింది. గత ఏడాది వ రదల ప్రభావంతో ముంపునకు గురైన నేపథ్యం లో అధ్యయనం సమగ్రంగా జరగాలని తెలంగా ణ ఈఎన్సీ అనిల్ కుమార్ కోరారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ హైదరాబాద్‌లోని సెంట్రల్ వాటర్ కమిటీ కార్యాలయంలో భేటీ అయింది. పోలవరం ప్రాజెక్టు అథారిటీ చైర్మన్ అతుల్ జైన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రాజెక్టు అథారిటీ ఛైర్మన్ అతుల్ జైన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తెలంగాణ ఈఎన్సీ అనిల్, ఏపీకి చెందిన ఇద్దరు చీఫ్ ఇంజినీర్లు భేటీలో పాల్గొన్నారు. పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతి, అంచనా వ్యయం, నిధులు వం టి తదితర అంశాలపై సమావేశంలో చర్చించిన ట్లు సమాచారం. . తెలంగాణ ప్రాంతంలో ముంపును గుర్తిం చే అంశం, పోలవరం బ్యాక్ వాటర్స్ ప్రభావం ఉండే ప్రాంతాల్లతీసుకోవాల్సిన చర్యలపై ప్రధానంగా చర్చకు వచ్చినట్లు తెలిసింది. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఉన్న అభ్యంతరాలను తెలంగాణ అధికారులు మరోమారు ఈ భేటీలో లేవనెత్తారు. పోలవరం పూర్తి నిల్వ సామర్థ్యం గురించి సమావేశంలో తెలంగాణ అధికారులు ప్రస్తావించారు. కిన్నెరసాని, ముర్రేడువాగు, ఇతర ప్రవాహాల చర్యల గురించి ప్రస్తావించారు. ఖమ్మం పట్టణం, భద్రాచలం పట్టణాలపై పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావం, రామాలయం వద్ద నీటిమట్టం, మణుగూరు భారజల ప్లాంట్ వద్ద వాటర్ లెవెల్స్ అంశంపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలని రాష్ట్ర అధికారులు మరోసారి అథారిటీని కోరారు.

## ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

### అదనపు కలెక్టర్ ఎస్.కిరణ్ కుమార్



నిజామాబాద్, ఏప్రిల్ 12 : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ ఎస్.కిరణ్ కుమార్ అధికారులకు సూచించారు. నవీపేట్ మండలం నాగేపూర్, నిజాంపూర్, నాలేశ్వర్, నవీపేట్ లలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ శనివారం సందర్శించారు. రైతుల సౌకర్యార్థం కేంద్రాల్లో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు. ధాన్యం తరలించిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. కాంటా చేసేందుకు సిద్ధంగా ఉంచిన ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారులకు తెలియచేయాలని రైతులకు సూచించారు. కాగా, నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ జరిగేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని వెంటదివెంట లారీలలో లోడ్ చేయించి కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో క్షేత్రస్థాయి సిబ్బంది మొదలుకుని అధికారుల వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు. రైతులు ధాన్యం తీసుకువచ్చిన వెంటనే తూకం జరిపించాలని, నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యం తీసుకువచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అదనపు కలెక్టర్ వెంట డీసీఓ శ్రీనివాస్ రావు తదితరులు ఉన్నారు.

## ప్రైవేట్ పరం కాబోతున్న 400 ఎకరాల భూమిని కాపాడం

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



హైదరాబాద్ ఏప్రిల్ 12.ప్రైవేటుపరం కాబోతున్న 400 ఎకరాలభూమిని రాష్ట్ర ప్రభుత్వం కాపాడిందని రాష్ట్ర శాసనసభ వ్యవహారాల ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళశ్రీధరాబాబు తెలిపారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై ఆయన గాంధీభవన్లో మీడియాతో మాట్లాడారు. ఈ భూములు ప్రభుత్వానివేనని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంగా చెప్పినప్పటికీ కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఏఐ వీడియోలు సృష్టించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు."సామాజిక మాధ్యమాల్లో ఫేక్ వీడియోలు వైరల్ చేసి దుష్ప్రచారం చేశారు. హెచ్సీయూ భూములు, పరిసరాల్లో ఏనుగులు ఉన్నాయా? విద్యార్థులను ప్రభావితం చేసి ప్రభుత్వ పనులను అడ్డుకోవాలని చూస్తున్నారు. హైదరాబాద్కు పెట్టుబడులు, ఉద్యోగాలు రావొద్దని కుట్ర చేస్తున్నారు. సెబీ నిబంధనలకు అనుగుణంగానే బాండ్ల జారీ ప్రక్రియ ఉంటుంది. ఐసీఐసీఐ నుంచి మేం ఎలాంటి లోన్లు తీసుకోలేదు. కంచ గచ్చిబౌలి భూములపై ఎలాం వివాదాలు లేవు. రాష్ట్ర ప్రజల సంక్షేమ కార్యక్రమాల కోసమే నిధులు సేకరిస్తున్నాం" అని శ్రీధరాబాబు తెలిపారు.

## హనుమాన్ శోభయాత్రలో పాల్గొన్న మల్కాజిగిరి ఎంపీ

మల్కాజ్గిరి ఏప్రిల్ 12. కోటి సుల్తాన్ బజార్లో ప్రారంభమైన హనుమాన్ శోభాయాత్రలో మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ హనుమాన్ జయంతి ఉత్సవాన్ని దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నామని ఈ సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. హనుమాన్ శోభాయాత్రను ప్రతి గ్రామంలో. ప్రతి గల్లీలో. ప్రతి బస్తీలో. ప్రతి పట్టణంలో శోభాయమానంగా ర్యాలీలు నిర్వహిస్తున్న కార్యకర్తలకు. నాయకులకు. ధర్మ రక్షకులకు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.







# సినిమా తీరు

## అర్జున్ సన్నాఫ్ వైజయంతి.. కాన్ఫిడెన్స్ ఏ రేంజ్ లో ఉందంటే.



: నందమూరి కళ్యాణ్ రామ్ కెరీర్‌లో అర్జున్ సన్నాఫ్ వైజయంతి అనే సినిమా ప్రత్యేకంగా నిలవబోతున్నట్లు అర్థమవుతుంది. కథ విన్న మొదటి రోజునుంచి కళ్యాణ్ రామ్‌కు ఈ సినిమా మీద కాన్ఫిడెన్స్ మామూలుగా లేదట. ప్రతి అడుగులోనూ, క్యాస్టింగ్ నుండి షూటింగ్ వరకూ, ప్రోమోషన్ వరకు.. అతను సొంత సినిమాలా జాగ్రత్తగా చూసుకుంటున్నాడు. ఇది ఒక మామూలు ప్రాజెక్ట్ కాదు, కళ్యాణ్ రామ్ వ్యక్తిగతంగా కనెక్ట్ అయ్యేలా ఉన్న కథ కావడమే కారణం.ఈ సినిమాలో విజయశాంతిని తల్లి పాత్రకు తీసుకోవడం బిగ్ అడ్వాంటేజ్ గా మారింది. ఆమెకు కథ నచ్చితేనే ఓకే చెబుతారు. అలాంటి సీనియర్ లెజెండ్ ఓ మదర్ క్యారెక్టర్‌కు ఓకే చెప్పింది అంటే.. ఈ కథలోని కంటెంట్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉంది. విజయంలో కీలకమైన ఎమోషన్, తల్లి కొడుకు మధ్య బంధం ప్రధాన ఆకర్షణగా నిలవబోతోంది. ఈ సినిమాలో కళ్యాణ్ రామ్ నటనకు మంచి స్కోప్ ఉందని టాక్ వినిపిస్తోంది. అర్జున్ పాత్రలో కళ్యాణ్ రామ్ ఒక బాధ్యతగల కుమారుడిగా కనిపించనున్నాడు. కుటుంబాన్ని కాపాడే కోణంలో ఆయన దూకుడు, సెంటిమెంట్ రెండు కలిసి కలబోతగా నడవబోతున్నాయి. ముఖ్యంగా ఎమోషనల్ సీన్స్ తో పాటు హై ఓల్టేజ్ యాక్షన్ సీక్వెన్సులు ఆయన స్టైల్‌కు తగ్గట్టుగానే ఉండనున్నాయి.

ఇదంతా చూడటానికి స్క్రీన్ మీద క్లాస్ అండ్ మాస్ కలయిక అనే ఫీల్‌ను ఇవ్వబోతోందన్న అభిప్రాయం ట్రేడ్ సర్కిల్స్ లో వ్యక్తమవుతోంది. ఇప్పటికే ప్రోమోషన్లలో కళ్యాణ్ రామ్ యాక్టివ్ గా పాల్గొంటున్న తీరు ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంటోంది. కొన్ని రోజులుగా ప్రెస్ మీట్లు, ట్రావెల్ ప్రోగ్రామ్స్, కాలేజీ ఈవెంట్లలో ఆయన పాల్గొంటూ సినిమాపై హైప్‌ను పెంచుతున్నారు. ఇంతకాలం గ్యాప్ తర్వాత బిజీగా ప్రచారం చేస్తున్న కళ్యాణ్ రామ్ ను చూసి అభిమానులు ఆనందంగా ఫ్లెక్సీలు, ర్యాలీలతో మద్దతు తెలియజేస్తున్నారు. ఆయన నమ్మకమే ఇప్పుడు సినిమా సక్సెస్ కీగా మారబోతోంది. ఈ సినిమాను ప్రదీప్ చిలుకూరి డైరెక్ట్ చేస్తున్నాడు. అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బాలుసు నిర్మాణ బాధ్యతలు చేపట్టారు. మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ లోక్ నాథ్ సంగీతం ఇప్పటికే ఆకట్టుకుంటోంది. ఇక ఎన్టీఆర్ చేతుల మీదుగా ట్రైలర్ విడుదల కాబోతోంది. ఏప్రిల్ 18న గ్రాండ్ రిలీజ్ కానున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ట్రైలర్ విడుదలతో అర్జున్ క్రేజ్ మరో స్థాయికి చేరనుంది. ఇక బాక్సాఫీస్ వద్ద సినిమా ఎలాంటి కలెక్షన్స్ అందుకుంటుందో చూడాలి.

## అసలు మీరు ఎలా జీవిస్తున్నారు?:

: టాలీవుడ్, కోలీవుడ్‌లో సమానంగా ఆదరణ పొందిన స్టార్ హీరోయిన్ త్రిష కృష్ణన్. ఇక ఇటీవల ఆమె నటించిన గుడ్ బ్యాడ్ అగ్లీ మూవీ విడుదలైంది. నాలుగు పదుల వయసులో కూడా ఆమె చెక్కుచెదరని అందంతో నేటితరం కుర్ర హీరోయిన్స్ కు పోటీగా నిలుస్తోంది. ఇక సక్సెస్ ఫెయిల్యూర్స్ తో సంభంధం లేకుండా అవకాశాలు అందుకుంటోంది. అయితే సోషల్ మీడియాలో ట్రోల్స్ నుంచి ఎదురైన నెగటివ్ కామెంట్లకు అమ్మడు గట్టిగా కౌంటర్ ఇచ్చింది. లేటెస్ట్ గా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన స్టోరీ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. ఇందులో త్రిష కేవలం నెగటివ్ రివ్యూలనే కాదు, వ్యక్తిగత దూషణలు చేసే వారుపై కూడా తనదైన శైలిలో స్పందించింది. "షబాష్... మీరు ఎలా జీవిస్తున్నారు? సరిగా నిద్ర పడుతుందా? ఇతరుల గురించి అర్థం లేని కామెంట్లు పోస్టు చేయడం వల్ల నిజంగా రోజంతా మీకు సంతృప్తిగా ఉంటుంది అనుకుంటున్నారా?" అంటూ ట్రోల్స్‌పై ప్రశ్నలు గుప్పించింది. అంతేకాకుండా "మీ గురించి కాదు... మీ చుట్టూ ఉన్నవాళ్ల గురించి కూడా బాధగా ఉంది" అంటూ ఆమె ఎమోషనల్‌గా స్పందించింది. త్రిష ఈ మాటలు చెప్పడానికి కారణం గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాలో ఆమె పాత్రపై సోషల్ మీడియాలో వచ్చిన మిశ్రమ స్పందనలు. కొన్ని సమీక్షల్లో ఆమె నటనపై ప్రశంసలు వచ్చినా, కొంతమంది మాత్రం పెద్దగా ఆకట్టుకోలేదని కామెంట్లు చేశారు. వాటిలో కొన్ని ట్రోలింగ్ స్థాయికి దిగజారడంతో త్రిష ఇలా స్పందించాల్సి వచ్చింది. త్రిష ఇండస్ట్రీలో అడుగు పెట్టి 20 ఏళ్లకు పైనే అయ్యింది. ఈ క్రమంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్న ఆమె నెగిటివ్ కామెంట్స్ ను కూడా చాలానే చూసింది. కానీ ఈ రేంజ్ లో ఎప్పుడు రియాక్ట్ కాలేదు. కాబట్టి అమ్మడు



గతంలో వచ్చిన కామెంట్స్ కు అలాగే ఇప్పుడు వస్తున్న ట్రోల్స్ పట్ల ఏ విధంగా ఆలోచిస్తుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ రోజుల్లో ట్రోల్స్ మితిమీరిన విధంగా ఉంటున్నాయని ఆమె చెప్పకనే చెప్పేసింది. ఇక సినిమా విషయానికొస్తే, అజిత్ కుమార్ హీరోగా నటించిన గుడ్ బ్యాడ్ అగ్లీ విడుదలైన తొలి రోజే భారత్‌లో దాదాపు ?29.35 కోట్లు వసూలు చేసింది. అజిత్ అభిమానులు సినిమా మీద మంచి రెస్పాన్స్ ఇస్తుండగా, త్రిష పాత్రకు కూడా ఒక వర్గం ప్రేక్షకులు మద్దతు తెలుపుతున్నారు. ఈ సినిమాకి ఆదిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహించగా, జి.వి. ప్రకాష్ సంగీతాన్ని అందించారు. మొత్తానికి త్రిషా కేవలం తన పాత్రపై విమర్శలతోనే కాదు, వ్యక్తిగత దూషణల మీద గట్టి రిప్లై ఇచ్చింది. మరి ఆమె చేసిన కామెంట్స్ వలన, ట్రోలింగ్‌కు ఎంతవరకు బ్రేక్ పడుతుందో చూడాలి.

## ఆహారంలో ఈ ఒక్కటి చేర్చుకోండి షుగర్ లెవల్స్ నెయ్యిలా కరిగిపోతుంది.




కాకరకాయ, లేదా కరేలా అని కూడా పిలుస్తారు, ఇది చేదు రుచితో ప్రసిద్ధి చెందినప్పటికీ, అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది. దీనిని ఆయుర్వేద వైద్యంలో ఎప్పటినుండో ఉపయోగిస్తునక్నారు. దీనిలో ఉండే పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు శరీరానికి చాలా మంచివి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు లివర్ శుభ్రతను పెంపొందిస్తాయి, కిడ్నీ రాళ్లు ఏర్పడకుండా నిరోధిస్తాయి. ఇది విష హరణ గుణాలతో కూడా పనిచేస్తుంది, శరీరంలో పేరుకున్న టాక్సిన్లను తొలగించడంలో సహాయపడుతుంది.కాకరకాయ కంటి ఆరోగ్యంకు మంచిది, కంటి సంబంధిత సమస్యల నుంచి రక్షణనిస్తుంది. షుగర్ నియంత్రణ: కాకరకాయలో పాలీపెప్టైడ్-పి అనే పదార్థం ఉంటుంది, ఇది ఇన్సులిన్‌లా పనిచేసి రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. కాకరను తరచూ ఆహారంలో చేర్చుకోవడం వలన మధుమేహ రోగులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. " చికెన్ లివర్ తింటున్నారా? ఇవి తప్పక తెలుసుకోండి! " జీర్ణ వ్యవస్థకు మేలు: కాకరకాయలో అధిక మొత్తంలో ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, మలబద్ధకం నివారిస్తుంది , మొత్తం జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంతో సహాయపడుతుంది. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది: విటమిన్ సి యొక్క గొప్ప మూలం కావడంతో, కాకరకాయ రోగనిరోధక శక్తిని బలపరచి, అనారోగ్యాల నుండి రక్షిస్తుంది. అంతే కాకుండా మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తుంది, రాళ్లు ఏర్పడకుండా చేయడంలో సహాయపడుతుంది. చర్మం ఆరోగ్యానికి: కాకరకాయలో యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని కాంతివంతంగా చేసి, ముడతలు పడకుండా నిరోధిస్తాయి. ఎక్జిమా, పిమ్పుల్స్ వంటి చర్మ సమస్యల నివారణకు కూడా ఇది సహాయపడుతుంది.శరీరంలో పేరుకున్న టాక్సిన్లను తొలగించడంలో తోడ్పడుతుంది. "ఈ ఒక్క నూనె వాడితే చాలు ముఖంపై ముడతలు మాయం.. మృదువైన చర్మ సౌందర్యం మీ సొంతం!" బరువు తగ్గడం: ఎక్కువ ఫైబర్ ఉండటం వల్ల కాకరకాయ బరువు తగ్గడానికి సహాయపడుతుంది, శరీరంలో కొవ్వును కరిగిస్తుంది. దీనిలో విటమిన్ ఎ అధికంగా ఉండటం వల్ల కళ్ల ఆరోగ్యానికి చాలా మంచిది. కంటి సంబంధిత సమస్యల నుంచి రక్షణనిస్తుంది. క్యాన్సర్ నిరోధక గుణాలు: కొన్ని అధ్యయనాలు కాకరకాయ కొన్ని రకాల క్యాన్సర్లను నిరోధించే గుణాలను కలిగి ఉందని సూచిస్తున్నాయి. కాకరకాయ ఆరోగ్య ప్రయోజనాలతో నిండి ఉంది. దీనిని తరచూ తీసుకోవడం వల్ల మన ఆరోగ్యం మెరుగుపడుతుంది. కాబట్టి, ఈ చేదు పండును మీ ఆహారంలో భాగం చేసుకోవడం మంచిది.

## అల్లు అర్జున్ – అట్లీ.. ఆమె రిజెక్ట్ చేసిందా?

స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్, మాస్ కమర్షియల్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో ఓ భారీ పాన్ వరల్డ్ మూవీ తెరకెక్కబోతోన్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై భారీ స్థాయిలో బజ్ క్రియేట్ అయింది. ఇటీవల విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ వీడియో ప్రేక్షకుల్లో మంచి హైప్ తెచ్చింది. విజువల్స్ దెబ్బకి, అట్లీ మేకింగ్ శైలికి మరోసారి అభిమానుల్లో నమ్మకమొచ్చింది. దీనికి తోడు హాలీవుడ్ స్థాయి వీఎఫ్ఎక్స్ స్టూడియోలతో కలిసి రూపొందిస్తున్న సినిమా కావడంతో ప్రాజెక్ట్‌పై ఆసక్తి ఇంకా పెరిగిపోయింది. ఇప్పటికే లాస్ ఏంజిల్స్ వెళ్లి బన్నీ-అట్లీ వీఎఫ్ఎక్స్ టీంతో ప్రత్యేకంగా వర్క్ షాపులు కూడా నిర్వహించారు. ఈ సినిమాకు దాదాపు 800 కోట్ల బడ్జెట్ కేటాయించినట్టు టాక్. ఇందులో ఒక్క వీఎఫ్ఎక్స్ పనులకే ?250 కోట్లను ఖర్చు చేయనున్నారు. సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో డిజిటల్ డీ ఏజింగ్ టెక్నాలజీ, హై టెక్ విజువల్స్, డ్యూయల్ షేడ్స్‌లో బన్నీ లుక్ వంటి అంశాలు చర్చనీయాంశమయ్యాయి. 2026లో ఈ సినిమా విడుదల చేయాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్‌కు జాతీయ స్థాయిలో అంచనాలు ఏర్పడ్డాయి. అయితే ఇంకా కథానాయికపై క్లారిటీ లేదు. సమంత, రష్మిక వంటి పేర్లు చక్కర్లు కొట్టాయి. తర్వాత బాలీవుడ్ నుంచి ఓ స్టార్ హీరోయిన్ ఉండే అవకాశం ఉందంటూ వార్తలు వచ్చాయి. మరి ఆ స్టార్ ఎవరు అన్న అనుమానాలకు తెరదించే విధంగా.. తాజాగా ప్రియాంకా చోప్రా పేరు తెరపైకి వచ్చింది. అయితే ఇందులో ట్విస్ట్ ఏంటంటే.. ప్రియాంకా ఈ సినిమాలో నటించేందుకు నిరాకరించిందట. ఆమెను ఈ సినిమాకు అట్లీ అప్రోచ్ చేయగా, కథలో కొన్ని క్రియేటివ్ డిఫరెన్సుల వల్ల ఆమె ప్రాజెక్ట్ ను రిజెక్ట్ చేసినట్లు టాక్ వస్తోంది.. ప్రియాంకాకు అదే సమయంలో దర్శకధీరుడు రాజమౌళి కూడా 'ఎస్ఎస్ఎంబీ29' సినిమాకు సంబంధించిన కథను చెప్పినట్టు టాక్. అమెజాన్ అడవుల్లో జరుగుతున్న అడ్వెంచర్ నేపథ్యంలో ఉన్న ఈ కథ ఆమెను ఎంతగానో ఆకట్టుకుందట. అల్లు అర్జున్ అట్లీ ప్రాజెక్ట్‌ను వదులుకుని, మహేష్ బాబు-రాజమౌళి సినిమా కోసం ఒప్పుకున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తోంది. అధికారికంగా ఈ విషయాలపై ఎలాంటి ధృవీకరణ రాలేదు కానీ, ట్రేడ్ సర్కిల్లో మాత్రం ఇది హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం ప్రియాంకా హాలీవుడ్ ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉంది.

అందానికే మరో అందం....




## హీటెక్కించేలా తమన్నా 'నషా'

బాలీవుడ్ స్టార్ హీరో అజయ్ దేవగన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న క్రైమ్ థ్రిల్లర్ చిత్రం 'రైడ్ 2' 2) మే 1న విడుదల కానుంది. రాజ్ కుమార్ గుప్తా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా మీద ఇప్పటికే మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఇదొక క్రైమ్ డ్రామా కాన్వాస్ మీద రూపొందుతున్న ప్రాజెక్ట్. మొదటి భాగం విజయవంతమైన తరుణంలో 'రైడ్ 2'పై ప్రేక్షకుల ఆసక్తి పెరిగింది. ఇక ఇప్పుడు ఈ సినిమాకు తమన్నా స్పెషల్ సాంగ్ "నషా" అదనపు ఆకర్షణగా మారింది.కాన్ఫిడెన్స్ ఏ రేంజ్ లో ఉందంటే.. తాజాగా విడుదలైన "నషా" అనే ఈ పాట యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతోంది. టి-సిరీస్ మ్యూజిక్ ద్వారా విడుదలైన ఈ సాంగ్‌కు ఇప్పటికే లక్షల్లో వ్యూస్ వచ్చాయి. తమన్నా గ్లామరస్ లుక్, ఎనర్జిటిక్ డాన్స్ స్టెప్పులు.. ఇవన్నీ మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ పాటలో ఆమె గోల్డెన్ టాప్, వైట్ స్కర్ట్ లుక్‌లో కనిపించి ఓ రేంజ్‌లో సర్ ప్రైజ్ చేసింది. ఈ పాటకు జాస్మిన్ శాండ్‌లాస్, సచేత్ టాండన్, దివ్య కుమార్, సుమంతో ముఖర్జీ కలిసి గానం చేశారు. జానీ సాహిత్యం అందించగా, మ్యూజిక్‌ను 'వైట్ నాయిస్ కలెక్టివ్' అందించింది. నేషనల్ అవార్డ్ విన్నింగ్ టెక్నీషియన్స్ పని చేసిన ఈ పాటలో వినిపించే రిథమ్, హుక్ లైన్స్ అన్నీ యూత్‌ని షేక్ చేస్తున్నాయి. ముఖ్యంగా తమన్నా స్టెప్పులు ఆకట్టుకుంటున్నాయి.




పాట చిత్రీకరణ గ్రాండ్ గా జరగగా, మాస్ క్లాస్ ఆడియెన్స్‌కి ఇది పక్కా విజువల్ ఫీట్ లాగా మారింది.ఆయనకు అపొజిట్ గా రితేశ్ దేశ్‌ముఖ్ విలన్ పాత్రలో నటిస్తున్నారు. అలాగే ఈ సినిమాలో కీలక పాత్రల్లో వాని కపూర్, రాజత్ కపూర్ వంటి వారు కూడా ఉన్నారు. అయితే, తమన్నా చేసిన ఐటెం సాంగ్ ఇప్పుడు సినిమా ప్రమోషన్స్ లో ప్రధాన హైలైట్‌గా మారింది. ఇప్పటివరకు తమన్నా నటించిన ఐటెం సాంగ్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. అయితే "నషా" పాటలో ఆమె హావభావాలు, స్టెప్పులు, స్క్రీన్ ప్రెజెన్స్ చూస్తుంటే ఇది మరో చార్ట్ బస్టర్‌గా నిలవబోతోందని అనిపిస్తోంది. సోషల్ మీడియాలో ఇప్పటికే ఈ పాట మ్యూజిక్ రీల్స్, డాన్స్ కవర్స్ వైరల్ అవుతున్నాయి. ఈ సాంగ్ సక్సెస్ తో రైడ్ 2 బిజినెస్ కి మరింత ఊపు వచ్చే అవకాశం ఉంది. ఇక మొత్తంగా చూస్తే, తమన్నా "నషా"తో మాస్ ఆడియెన్స్‌ను థియేటర్లకు రప్పించే పనిలో పడ్డారు. మే 1న సినిమా విడుదలతో పాటు ఈ పాట థియేటర్ లో వెండి తెరపై ఎలా హైలెట్ అవుతుందో చూడాల్సిందే.

## అర్ధ శతకాలతో రెచ్చిపోయిన గిల్, సుదర్శన్.. అయినా భారీ స్కోర్ కొట్టలేకపోయిన గుజరాత్

ఐపీఎల్18వ సీజన్‌లో భీకర ఫామ్‌లో ఉన్న గుజరాత్ టైటన్స్ ఓపెనర్లు శుభ్‌మన్ గిల్(60), సాయి సుదర్శన్(56)లు మరోసారి చితక్కొట్టారు. ఎక్నాస్టేడియంలో లక్నో సూపర్ జెయింట్స్(ఒూఉ) బౌలర్లకు చుక్కలు చూపించారు. అర్ధ శతకాలతో చెలరేగిన ఈ ద్వయం తొలి వికెట్‌కు 120 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి భారీ స్కోర్‌కు బాటలు వేసింది. అయితే.. స్ట్రాటజిక్ టైమౌట్ తర్వాత పుంజుకున్న లక్నో బౌలర్లు గుజరాత్ మిడిలార్డర్‌ను క్రీజులో నిలవనీయలేదు. ఆఖర్లో షెర్ఫానే రూథర్‌ఫోర్డ్(22) ఒక్కడే మెరుపులు మెరిపించగా గిల్ బృందం నిర్ణీత ఓవర్లలో 180 రన్స్ చేయగలిగింది.టేబుల్ టాపర్ గుజరాత్ టైటన్స్‌కు ఓపెనర్లు శుభ్‌మన్ గిల్(60 : 38 బంతుల్లో 6 ఫోర్లు, ఒక సిక్సర్), సాయి సుదర్శన్(56 : 37 బంతుల్లో 7 ఫోర్లు, ఒక సిక్సర్) అదిరే శుభారంభం ఇచ్చారు. ఓవర్‌కు ఒకటి.. రెండు బౌండరీలు బాదేస్తూ స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. అవేశ్ ఖాన్ వేసిన 6వ ఓవర్ తొలి బంతిని గిల్ బౌండరీకి పంపడంతో జట్టు స్కోర్ 50కి చేరింది. పవర్ ప్లేలో వికెట్ కోల్పోకుండా 54 రన్స్ కొట్టిన గుజరాత్ ఇన్నింగ్స్ ఆ తర్వాత మరింత దూకుడుగా సాగింది.కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన గిల్ అర్ధ శతకంతో రెచ్చిపోయాడు. సుదర్శన్‌తో కలిసి తొలి వికెట్‌కు 120 రన్స్ జోడించి పటిష్ట స్థితిలో నిలిపాడు. అయితే.. ప్రమాదకరంగా మారుతున్న ఈ ద్వయాన్ని అవేశ్ ఖాన్ విడదీశాడు. 13వ ఓవర్ తొలి బంతికిగిల్ లాంగాన్‌లో భారీ షాట్‌కు యత్నించగా.. బౌండరీ లైన్ వద్ద మర్కరమ్ అద్భుతంగా క్యాచ్ పట్టాడు. ఆ కాసేపటికే బిష్ణోయ్ బౌలింగ్‌లో సుదర్శన్ ఆఫ్‌సైడ్ కొట్టిన బంతిని పూరన్ ఒడిసి పట్టుకున్నాడు. దాంతో.. 122 వద్ద గుజరాత్ రెండు కీలక వికెట్లు కోల్పోయింది.ఓపెనర్లను పెవిలియన్ చేర్చిన లక్నో బౌలర్లు తమ జోరు చూపిస్తూ వరుసగా వికెట్లు తీశారు. వాషింగ్టన్ సుందర్(2)ను ఔట్ చేసిన బిష్ణోయ్ రెండో వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. విధ్వంసక ఇన్నింగ్స్‌లకు పెట్టింది పేరైన జోస్ బట్లర్(16) సైతం స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగాడు. దిగ్వేశ్ రథీ బౌలింగ్‌లో బట్లర్ వికెట్ పారేసుకున్నాడు. బట్లర్ ఆడిన బంతి ఎడ్జ్ తీసుకొని గాల్లోకి లేవగా.. శార్దూల్ ఠాకూర్ పరుగెడుతూ వెళ్లి క్యాచ్ పట్టాడు.అంతే.. దిగ్వేశ్ తనదైన స్టయిల్లో మైదానంలోని గడ్డి మీద నోట్‌బుక్ సెలబ్రేషన్ చేసుకున్నాడు. 25 పరుగుల వ్యవధిలోనే 4 వికెట్లు తీసిన లక్నో బౌలర్లు గుజరాత్ బ్యాటర్లపై ఒత్తిడి పెంచారు. షెర్ఫానే రూథర్‌ఫోర్డ్(22), షారుక్ ఖాన్(11)లు జట్టు స్కోర్ 150 దాటించారు. శార్దూల్ వేసిన 20వ ఓవర్ తొలి బంతిని స్టాండ్స్‌లోకి పంపాడు షారుక్. మూడో బంతికి రూథర్‌ఫోర్డ్ ఎల్బీగా డగౌట్ చేరాడు. ఆ తర్వాత బంవతికే రాహుల్ తెవాటియా(0) సిక్సర్ కొట్టబోయి మర్కరమ్ చేతికి చిక్కాడు. దాంతో, గుజరాత్ నిర్ణీత ఓవర్లలో6 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది.




## పాకిస్తాన్ సూపర్ లీగ్.. క్రికెటర్లు బస చేసిన హోటల్‌లో అగ్నిప్రమాదం..!

పాకిస్తాన్ సూపర్ లీగ్ శుక్రవారం మొదలైంది. అయితే, టోర్నీ ప్రారంభానికి ముందు ఇస్లామాబాద్‌లోని హోటల్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. ఇక్కడ పీఎస్ఎల్ జట్టు క్రికెటర్లతో పాటు సిబ్బంది ఈ హోటల్‌లోనే బస చేశారు. ఇస్లామాబాద్‌లోని సెరెనా హోటల్‌లోని ఆరవ అంతస్తులో మంటలు చెలరేగాయని స్థానిక అధికారులు మీడియాకు తెలిపారు. ఆ తర్వాత అగ్నిమాపక సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి మంటలను అదుపులోకి తీసుకువచ్చింది. పీఎస్ఎల్ క్రికెటర్లు, సిబ్బందిని రక్షించారు. మంటల్లో ఎవరూ గాయపడలేదని.. వారిని అక్కడి నుండి మరో చోటుకి తరలించినట్లు పేర్కొన్నారు. సకాలంలో మంటలను అదుపు చేయడంతో ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. సీఎస్ఎల్ సీఈవో సల్మాన్ నసీర్ మీడియాతో మాట్లాడుతూ మంటలు హోటల్‌లోకి ప్రవేశించలేదన్నారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసినట్లు తెలిపారు. ఆరు ఫైర్ ఇంజిన్లు, 50 మంది సిబ్బంది వేగంగా స్పందించి మంటలను అదుపులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. అరగంటలోనే పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చినట్లు సీడీఏ అత్యవసర డైరెక్టర్ జాఫర్ ఇక్బాల్ పేర్కొన్నారు.పీఎస్ఎల్ 2025 తొలి మ్యాచ్‌లో ఇస్లామాబాద్ యునైటెడ్.. లాహోర్ ఖలందర్స్‌తో రావల్పిండి క్రికెట్ స్టేడియంలో తలపడింది. ఐపీఎల్ నేపథ్యంలో పీఎస్ఎల్ తొలి మ్యాచ్‌ను గంట ఆలస్యంగా ప్రారంభించింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY BYAGAL SRINIVAS, PRINTED AT S.S. PRINTERS & FILE MAKERS, PUS ALAGALLY, JAWAHAR ROAD, Town & Dist.NIZAMABAD- 503001, TELANGANA STATE, PUBLISHED AT H.NO: 6-11-174/1, NAMDEVWADA, Town & Dist. NIZAMABAD, TELANGANA STATE - 503001.EDITOR: BYAGAL SRINIVAS.